TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 123 | శుక్రవారం, సెప్టెంబర్ 6, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### పారా అథ్లెట్లకు ప్రధాని మోడీ...

## అభినందనలు



న్యూఢిల్లీ: పారిస్ వేదికగా జరుగుతున్న పారాలింపిక్స్‌లో భారత అథ్లెట్లు అదరగొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రీడల్లో భారత్ ఇప్పటికే 20 పతకాలను సాధించి నయా చరిత్ర సృష్టించింది. షూటింగ్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ తదితర విభాగాల్లో భారత ఆటగాళ్లు అసాధారణ ఆటతో పతకాల పంట పండిస్తున్నారు. చారిత్రక ప్రదర్శనతో దేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిన పారా అథ్లెట్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభినందించారు. ఈ సందర్భంగా మోడీ పారా అథ్లెట్లతో ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడారు. పతకాలు సాధించిన భారత క్రీడాకారులకు మోడీ శుభాకాంక్షలు తెలిపారు. అంచనాలకు మించి రాణించిన అథ్లెట్ల ప్రతిభను ఎంత పొగిడినా తక్కువేనని కొనియాడారు. ప్రస్తుతం ప్రధాని బ్రూనైలో పర్యటిస్తున్నారు. బ్రూనైలో అధికారిక సమావేశాలు ముగిసిన అనంతరం ప్రధాన మంత్రి ప్రత్యేకంగా సంభాషించారు. పారిస్ క్రీడల్లో అసాధారణ ప్రతిభతో పతకాలు సాధించిన అథ్లెట్లు దీప్తి జీవాంజి, మరియప్పన్ తంగవేలు. సుందర్ సింగ్, శరద్ కుమార్ తదితరులను అభినందిస్తూ ప్రధాని ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్టు చేసిన సంగతి తెలిసిందే.

### భద్రాద్రి కొత్తగూడెంలో ఎన్‌కౌంటర్...

## ఆరుగురు మావోలు మృతి



హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దామరతోగు–కరకగూడెం మండలం నీలాద్రి పేట అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, లచ్చన్న దళానికి మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారు. ఎదురు కాల్పుల్లో ఒక గ్రేహౌండ్ కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన మావోయిస్టు పార్టీకి చెందిన లచ్చన్న దళం నీలాద్రి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు సమాచారం తెలియడంతో భద్రతా బలగాలు మావోయిస్టులను చుట్టుముట్టారు. లచ్చన్న దళం సభ్యులు, భద్రతా బలగాలు మధ్య ఎదురు కాల్పులు జరగడంతో ఆరుగురు మావోలు మృతి చెందారు. ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్న దళం కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్టు తమకు సమాచారం అందిందని భద్రతా బలగాలు వెల్లడించాయి. మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. రెండు రోజుల వ్యవధిలోనే 15 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు హతమార్చాయి.

### తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ

## డైరెక్టర్ దిలీప్ అరెస్ట్

హైదరాబాద్: తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను సిసిఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దిలీప్‌ను సిసిఎస్ పోలీసులు విచారిస్తున్నారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న తప్పులను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినందుకు ఆయనను అక్రమంగా అరెస్ట్ చేశారని బిఆర్ఎస్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. ఆయన అరెస్టును బిఆర్ఎస్ నేతలు ఖండిస్తూ ట్వీట్లు చేస్తున్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా దిలీప్ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా? అని కేటీఆర్ నిలదీశారు. కనీస సమాచారం ఇవ్వకుండా ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పకుండా అరెస్ట్ చేశారని విమర్శించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో పాలన కొనసాగించవచ్చనుకుంటే అది మీ భ్రమే అవుతుందని



హెచ్చరించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అక్రమ నిర్బంధాలు చేసినా ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లు మరింతమంది పుట్టుకు వస్తారన్నారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న దిలీప్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### సిద్దిపేట నుంచి ఉడుత భక్తిగా...

## సహాయం చేస్తున్నాం

సిద్దిపేట: ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, వరద బాధితులకు సిద్దిపేట నుంచి ఉడత భక్తిగా సహాయం చేస్తున్నామని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు తెలిపారు. మానవ సేవయే మాధవ సేవ అని అందరూ ముందుకు వచ్చి వరద బాధితులకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయం వద్ద ఖమ్మం వరద బాధితులకు సరకులు పంపే వాహనాలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడారు. సహాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా పాలనా కాదు రాక్షస పాలన నడుస్తుందని, ముందుగా ప్రభుత్వం మేలుకుంటే మరింత ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశం ఉండేదని హరీష్ రావు చురకలంటించారు. బిఆర్ఎస్ ఎంఎల్ఏలు, ఎంపిలు, ఎంఎల్ సిల నెల వేతనం వరద బాధితులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ తరహాలో బిజెపి, మిగతా పార్టీల నాయకులు సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. తాము వరద బాధితులకు సహాయం చేయడానికి ఖమ్మం వెళ్తే తమపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడంతో పాటు కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. వరద బాధితులు కాంగ్రెస్ ప్రభుత్వం పై దుమ్మెత్తిపోశారని, సిఎం రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు ఎవరు




భయపడరని హరీష్ రావు హెచ్చరించారు. బిఆర్ఎస్ కు వస్తున్న స్పందన ను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు దాడులకు తెగపడ్డారని ధ్వజమెత్తారు. బాధితులకు అన్నం, నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు నీళ్లలో మునిగి పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణ పట్టణం జైనూర్‌లో...

## కర్ఫ్యూ



హైదరాబాద్: కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ పట్టణంలో బుధవారం హింసాత్మక ఘటనలు జరగడంతో కర్ఫ్యూ విధించారు. ఓ ఆటో డ్రైవర్ అక్కడి గిరిజన మహిళపై లైంగిక దాడి చేయడానికి పూనుకోవడంతో ఈ ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఆమె కులానికి చెందిన వారు నిరసనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. జైనూర్ లో బిఎన్ఎస్ఎస్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. అంతేకాక జిల్లాధికారులు జైనూర్ పట్టణంలో ఇంటర్నెట్ నిషేధం కూడా విధించారు. బూటకపు వార్తలు, వదంతులు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులో ఉంది. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్) కూడా మోహరించినట్లు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. అక్కడ రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత బాగా పెరిగింది. ఒక వర్గం వారు మరో వర్గం వారిపై రాళ్ల దాడులకు పూనుకోవడం, ఆస్తులకు నష్టం కలిగించడం చేశారు. ఆగస్టు 31న ఆటో డ్రైవర్(45) ఓ గిరిజన మహిళ(31)పై లైంగిక దాడికి యత్నించడంతో పరిస్థితి విషమంగా తయారయింది.

## టార్గెట్ 40వేల మెగావాట్స్

హైదరాబాద్: రానున్న రోజుల్లో తెలంగాణ ఒక బిజినెస్ హబ్ గా మారబోతుందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉం చుకొని విద్యుత్‌ను అందుబాటులో ఉండేలా చూడాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఐటీ, పరిశ్ర మల శాఖలతో సమన్వయం చేసుకొని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సిఎం పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలని, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. వివిధ శాఖల్లో వినియోగంలో లేని భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకో వాలని సిఎం రేవంత్ సూచించారు. రైతులకు సోలార్ పంప్‌సెట్‌లను ఉచితంగా అందించి వారిని సోలార్ విద్యుత్ వైపు ప్రోత్సహించాలన్నారు. కొండారెడ్డి పల్లెను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సిఎం రేవంత్ అధికారులకు ఆదేశించారు. సోలార్ పంప్ సెట్‌ల ద్వారా వచ్చే మిగులు విద్యుత్‌పై రైతుకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం రేవంత్ సూచించారు. వంటగ్యాస్ బదులుగా సోలార్ సిలిండర్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై మహిళా సంఘాల కు శిక్షణ అందించి వారిని సోలార్ సిలిండర్ బిజినెస్ వైపు ప్రోత్సహించాలన్నారు.







# ప్రధాని మోడీపై రాహుల్ గాంధీ విమర్శలు

పుణె: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకుడు పతంగ్ రావు కదం విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మహారాష్ట్రలోని సాంగ్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడానికి కారణం విగ్రహ తయారీలో శిల్పి అవినీతి ఉందన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. అంతేకాక పెద్ద నోట్ల రద్దు(డీ మానిటైజేషన్), తప్పుడు పద్ధతిలో జిఎస్ టి అమలు చేయడంపై కూడా ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. సింధుదుర్గ్ లోని రాజ్ కోట్ కోట వద్ద శివాజీ విగ్రహం కూలిపోయింది. ప్రధాని మోడీ గత వారం మహారాష్ట్ర సందర్శించి క్షమాపణలు కూడా కోరారు. 'మహారాష్ట్ర చక్రవర్తి మా ఆరాధ్య దైవం' అని కూడా అన్నారు. 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని మోడీ గత ఏడాది డిసెంబర్ 4న ఆవిష్కరించారు. కానీ ఆ విగ్రహం ఆగస్టు 26న కూలిపోయింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ' ప్రధాని మోడీ కేవలం మహారాష్ట్ర రాజుకే కాదు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి క్షమాపణలు చెప్పాలి' అన్నారు. 'ప్రధాని పెద్ద కాంట్రాక్టులను కొంత మంది పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్నందుకు, పెద్ద నోట్లను రద్దు చేసినందుకు(డీమోనిటైజేషన్), తప్పుడు జిఎస్ టి విధానం అవలంబించినందుకు, దానివల్ల చిన్న, మధ్య తరహా వ్యాపారులు దెబ్బతినడమేకాక, తద్వారా నిరుద్యోగం పెరిగినందుకు ప్రధాని క్షమాపణలు చెప్పాలి' అని రాహుల్ గాంధీ అనక్నారు. కోట్ల కొద్ది రూపాయల రుణ మాఫీ బడా పారిశ్రామిక వేత్తలకు చేస్తూ, రైతులకు రుణమాఫీ చేయకపోవడంపై కూడా విమర్శించారు. ధనవంతులకు రుణ మాఫీ చేసినప్పుడు, పేదలకు ఎందుకు చేయరు? అని ప్రశ్నించారు.

# 27,862 ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

హైదరాబాద్: ప్రభుత్వ విద్యా సంస్థలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తును అందించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 27, 862 ప్రభుత్వ విద్యాలయాలకు లబ్ధి జరుగుతుందని చెప్పారు. విద్యా సంస్థలకు ఉచితంగా అందించే విద్యుత్ సరఫరాకు సంబంధించిన బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని వెల్లడించారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరుకాగా, మంత్రి పొన్నం ప్రభాకర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, ఇవి నరసింహారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా మంత్రులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అవార్డులు అందజేశారు. అనంతరం డిప్యూటీ సిఎం మాట్లాడుతూ, విద్యతో పాటు గురువులకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. గత పది సంవత్సరాల పాలనలో ఉపాధ్యాయులు పదోన్నతికి, బదిలీలు లేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల ఆకాంక్షలను అర్థం చేసుకున్న ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం 45 వేల మంది ఉపాధ్యాయులకు పారదర్శకంగా బదిలీలు చేయడంతో పాటు 30 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందని అన్నారు. గురువులు, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు ఏదీ ఉన్న ఈ ప్రభుత్వం పరిష్కరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. సమాజం అభివృద్ధి చెందాలన్నా నాగరికతతో ముందుకు వెళ్లాలంటే విద్య అవసరమని, ఆ విద్యను అందించే గురువుల ఆలోచనలను ఈ ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని విధానపరమైన నిర్ణయాలు రూపొందిస్తుందని వెల్లడించారు. ప్రగతిశీల రాష్ట్రంగా తెలంగాణ నిర్మాణం కావడానికి గురువుల పాత్ర కీలకంగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ప్రపంచంతో పోటీ పడేలా మన విద్యార్థులు రాణిస్తున్నారు.


విద్యా బుద్ధులతో పాటు మంచి అలవాట్లు, సంస్కారం నేర్పించిన మానవ వనరులు సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను ఎదుర్కొని ఈ సమాజానికి ఉపయోగపడతాయని, ఆ దిశగా విద్యాబోధన చేయాలని భట్టి విక్రమార్క గురువులకు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2007 సంవత్సరంలో ప్రభుత్వ బడులలో తెలుగు మీడియంతో పాటు ఆంగ్ల మీడియం విద్యా బోధన చేయాలని ఆనాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రోత్సహించి ఉపాధ్యాయులు అమలు చేయడం వల్లే నేడు ప్రపంచంతో పోటీ పడే విధంగా మన విద్యార్థులు రాణిస్తున్నారనీ పేర్కొన్నారు.

ఇదే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం ప్రపంచంతో పోటీపడే విధంగా మానవ వనరులను తయారు చేయడానికి తీసుకునే విధానపరమైన నిర్ణయాలను అమలు చేయడానికి ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. అభ్యుదయ భావాలతో గురువులు ఉండటం వల్ల ఆ స్ఫూర్తితో ఈ రాష్ట్రం ప్రగతిశీలంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చాలామంది గురువులు గొప్ప వాళ్లు ఉండటం, ప్రోగ్రెసివ్ ఆలోచనలు కలిగి ఉన్నందుకు గర్విస్తున్నానని చెప్పారు.

**మరో 6 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్**

ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని డిప్యూటీ సిఎం చెప్పారు. గత దశాబ్ద కాలంగా ఈ రాష్ట్రంలో డిఎస్‌సి నిర్వహించలేదని, దీనివల్ల ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని అన్నారు. తాము అధికారంలోకి రాగానే 11, 062 పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ వేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామని, రాబోయే రోజుల్లో మరో 6 వేలకు పైబడి పోస్టులకు నోటిఫికేషన్ వేయడానికి భవిష్యత్తు ప్రణాళికను తయారు చేసుకొని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు వేసి వాటి నిర్వహణను స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు అప్పగించి ఉందన్నారు. ఆదర్శ పాఠశాల కోసం ప్రభుత్వం రూ.667 కోట్ల వెచ్చించిందని వెల్లడించారు. ప్రభుత్వ బడులలో స్వీపర్లు లేకపోవడం వల్ల గురువులే పాఠశాలలను క్లీన్ చేసుకోవాల్సిన దుస్థితి గత పాలనలో నెలకొందని, ఆ పరిస్థితి పోవాలని ఈ ఆర్థిక సంవత్సరం శానిటేషన్ వర్క్స్ ఏర్పాటుకు రూ.136 కోట్లు విడుదల చేయడం చేసినట్లు పేర్కొన్నారు.

# రిలయన్స్ ఇండస్ట్రీస్ బోనస్ షేర్ ఇష్యూకు ఆమోదం




ముంబై: దేశంలో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం(సెప్టెంబర్ 5న) బోనస్ షేర్ల జారీకి ఆమోదం తెలిపింది. ప్రతి ఒక్క షేరుకు మరో షేరు బోనస్ గా ఇవ్వనున్నది. అయితే అది రికార్డ్ తేదీన ఇస్తారు. కానీ ఆ రికార్డ్ డేట్ ను ఇంకా నిర్ధారించలేదు. త్వరలో తెలుపుతారు. అంతేకాక ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్ పెంపును సిఫారసు చేసింది. రిలయన్స్ కంపెనీ బోర్డు ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్ ను రూ. 15000 కోట్లను రూ. 50 000 కోట్లు(5.96 బిలియన్ డాలర్లకు) పెంచుతూ సిఫారసు చేసింది. 2017 తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ బోనస్ షేర్లు ఇవ్వడం ఇప్పుడే మళ్లీ. ఇదివరలో(2017లో) బోనస్ షేర్లు ప్రకటించినప్పుడు షేరు ధర రూ. 700 గా ఉండింది. అప్పటి నుంచి ఈ కంపెనీ షేరు ధర బాగా పెరిగింది. రిలయన్స్ కంపెనీ లిస్టింగ్ అయినప్పటి నుంచి బోనస్ షేర్లు ఇవ్వడం ఇది ఆరోసారి. ఇదివరలో 1980,1983,1997, 2009, 2017లో బోనస్ షేర్లు ఇచ్చారు. రికార్డు డేట్ నాటికి డీమ్యాట్ లో షేర్లు ఉంటేనే ప్రతి ఒక్క షేరుకు మరో షేరు బోనస్ గా లభిస్తుంది. "రిలయన్స్ వృద్ధి చెందనప్పుడల్లా మేము మా షేర్ హోల్డర్లకు దండిగా రివార్డు ఇస్తాము" అని ముఖేశ్ అంబానీ బోర్డు సమావేశంలో తెలిపారు. రిలయన్స్ షేరు ఈ ఏడాది 16 శాతం మేరకు పెరిగింది. కానీ నేడు స్టాక్ మార్కెట్ లో 1.42 శాతం లేక రూ.43.15 మేరకు పతనమై రూ. 2985.95 వద్ద ముగిసింది. బోనస్ షేర్లు ప్రకటిస్తారన్న వార్త విన్నాక గత వారం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల ధర పెరిగింది.

# ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే పెన్షన్ కట్

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీలు ఫిరాయించే ఎమ్మెల్యేలకు పింఛన్లు ఉండవు. ఈ కోత విధించే రీతిలో ఓ బిల్లును కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఒక పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీకి వెళ్లే ఎమ్మెల్యేలకు పెన్షన్ సౌకర్యం లేకుండా చేసే ఈ బిల్లును సభ ఆమోదించింది. హిమాచల్ ప్రభుత్వం ఈ అసాధారణ బిల్లును తీసుకురావడం, ఆమోదింపచేసు కో వడం, ఫిరాయింపుల వ్యతిరేక ప్రక్రియలో కీలక ఘట్టం అయింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఈ బిల్లు వర్తిస్తుంది. వీరిపై వేటుపడుతుంది. బిల్లును రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ ప్రవే శపెట్టారు. హిమాచల్ ప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ( సభ్యుల అలవెన్స్‌లు,పెన్షన్లు)సవరణ బిల్లు2024 పేరిట దీనిని తీసుకువచ్చారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పరిధిలో ఏ దశలో అయినా సభ్యు లు అనర్హతకు గురైతే అటువంటి వ్యక్తి చట్టం పరిధి లో పెన్షన్, ఇతరత్రా అలవెన్స్‌లకు అర్హులు కారని ఈ బిల్లులో పేర్కొన్నారు. బిజెపి, కాంగ్రెస్ నడు మ తరచూ అధికార



మార్పిడి, ఈ క్రమంలో ఎమ్మె ల్యేల ఫిరాయింపులు జరిగే ఈ రాష్ట్రంలో ఈ బిల్లు అత్యంత కీలకమైనది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరు గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఫిరాయింపుల నిరో ధక చట్టం పరిధిలో ఎమ్మెల్యేలుగా అనర్హులుగా ప్రకటించారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్ రాహుల్ శర్మ



**చిట్యాల:** జయశంకర్ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల సమయంలో సమయపాలన, ప్రజలకు అందుబాటులో సేవలు అందించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగుల వివరాలు ఆన్ లైన్‌లో నమోదును కలెక్టర్ పరిశీలించారు. గ్రామాల్లో జ్వరాల బారిన పడకుండా ముందస్తు ట్యాగ్ చేసి ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని కోరారు. విధుల నిర్వహణలో భాగంగా వైద్యుల షెడ్యూల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. మూడు షిఫ్టుల్లో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. ఆగస్టు నెలలో 3,578 మందికి ఓపి, 655 మందికి ఇన్ పేషెంట్స్ కు వైద్య సేవలు అందించారని, 122 ఏఎన్సీ, 12 ప్రసవాలు, 8 ట్యూబెక్టమి శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. ప్రసవాలు పెంచాలని, ఇందుకొరకు అశల ద్వారా గర్భిణీ మహిళల జాభితా సేకరించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు, నిర్వహణ అన్ని వేళల్లో పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పాము, కుక్క కాటు మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. క్రిమిసంహారక మందులు సేవించి బలవన్మరణానికి పాల్పడుతున్న కేసుల గురించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఇన్చార్జి ఎంపీడీవో రామకృష్ణ ఆర్ఐ రాజు, గ్రామ కార్యదర్శి రవికుమార్, వైద్యులు డా.శ్రీకాంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళతో టిడిపి ఎంఎల్ఏ శృంగారం...

# వీడియో లీక్

తిరుపతి: సత్యవేడు టిడిపి ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం రాసలీలల వీడియో లీకైంది. చెల్లి అంటూనే తనపై లైంగికంగా దాడి చేశారని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలంపై టిడిపి అధిష్టానానికి సదరు మహిళ ఫిర్యాదు చేసింది. ఆదిమూలం ఎంఎల్ఎ అయిన తరువాత తనపై కక్ష గటి అసభ్యకరంగా ప్రవర్తించాడని సదరు మహిళ ఆరోపణలు చేసింది. తనతో వివాహేతర సంబంధం కొనసాగించాలని ఆమెపై ఎంఎల్ఎ ఒత్తిడి తీసుకొచ్చినట్టు ఆరోపణలు చేసింది. పలుమార్లు ఫోన్ చేసి తనని టార్చర్ చేశాడని తెలిపింది. ఎంఎల్ఎ ఆదిమూలం తనని లైంగికంగా వేధిస్తున్నాడని తన భర్తకు చెప్పడంతో కామాంధుడి బుద్ధి చెప్పాలని నిర్ణయం తీసుకున్నామని, పెన్‌లో కెమెరా పెట్టుకొని ఎంఎల్ఎ చెప్పిన బీమాస్ ప్యారడైజ్ హొటల్‌కు వెళ్లానని తెలియజేశారు. తనతో ఆదిమూలం అసభ్యంగా ప్రవర్తిస్తుండగా వీడియో



రికార్డు చేసి తన భర్తకు అప్పజెప్పడం జరిగిందని వివరించారు. సదరు ఎంఎల్ఎ నుంచి తన కుటుంబానికి ప్రాణభయం ఉందని, ఆదిమూలంపై చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ మారింది. మహిళతో చనువుగా ఉన్న వీడియో వైరల్ పై ఎంఎల్ఎ ఆదిమూలం స్పందించారు. తానేంటో తన పనితనం ఏంటో సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు తెలుసనని టిడిపి ఎంఎల్ఎ ఆదిమూలం తెలిపారు. కావాలనే కొందరు టిడిపి నాయకులు తనపై కుట్ర చేశారన్నారు. ఆమెతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ వీడియో చూస్తే మార్ఫింగ్ చేసినట్టు కనబడుతోందని ఆదిమూలం పేర్కొన్నారు. తనపై రాజకీయంగా కుట్ర జరిగిందని మండిపడ్డారు.

# బీహార్ లో కొత్త నేర చట్టాల కింద తొలి శిక్ష

పాట్నా: కొత్త నేర చట్టాల కింద బీహార్ లో ఓ హత్య కేసులో ఇద్దరికి తొలి శిక్ష... జీవిత ఖైదు పడింది. ఈ ఏడాది జులై 1న భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్) అమల్లోకి వచ్చాయి. అయితే ఈ కొత్త నేరాల చట్టాల కింద తొలి శిక్ష పిడింది. విశేషం ఏమిటంటే ఘటన జరిగిన 48 రోజుల్లోనే వారిని దోషులుగా తేల్చి శిక్ష విధించారు. బీహార్ లోని శరణ్ జిల్లాలో ధనాదిహ్ గ్రామానికి చెందిన తారకేశ్వర్ సింగ్ కుటుంబంపై జులై 17న దుండగులు దాడి చేశారు. డాబాపై నిద్రిస్తున్న వారిపై విచక్షణా రహితంగా దాడి చేసి పొడిచారు. ఈ ఘటనలో తారకేశ్వర్, ఆయన ఇద్దరు కుమార్తెలు ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. దాడికి పాల్పడిన సుధాన్షు కుమార్, అంకిత్ లను పోలీసులు అరెస్టు చేశారు. 14 రోజుల్లోనే వారిపై పోలీసులు అభియోగపత్రం నమోదు చేశారు. మంగళవారం జరిపిన విచారణలో కోర్టు వారిని దోషులుగా తేల్చి తీర్పు చెప్పింది. సెషన్స్ కోర్టు గురువారం వారికి జీవిత ఖైదు శిక్ష ఖరారు చేసింది.

తెలంగాణ క్యాపిటల్


## సంపాదకీయం

శుక్రవారం, సెప్టెంబర్ 6, 2024

# గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా

దాదాభాయి నౌరోజీ కాంగ్రెస్ పార్టీకి వాస్తవానికి ప్రాతఃస్మరణీయులు. ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఆయన ఒకరు. మూడు పర్యాయాలు జాతీయ కాంగ్రెస్ వార్షిక సభలకు అధ్యక్షత వహించిన నాయకులు. నౌరోజీ జీవిత చరిత్ర 19 వ శతాబ్దంలో భారతీయ జాతీయవాదుల పోరాటాలను స్పష్టంగా తెలుపుతుంది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించక ముందునుంచే స్వాతంత్ర్యం కోసం గళమెత్తారు. నౌరోజీ, ఎ. ఓ. హ్యూమ్, దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించారు. 1892 నుండి 1895 వరకు ఇంగ్లాండ్ చట్టసభ అయిన యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొనసాగారు. ఆయన ఆ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి. దాదాభాయ్ నౌరోజీ (సెప్టెంబర్ 4, 1825 – జూన్ 30, 1917) పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకులు, బ్రిటీష్ చట్టసభ సభ్యుడైన తొలి ఆసియా ఖండ వాసి అయిన దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4 న, బొంబాయిలో నవసారిలో ఒక పార్శీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పలన్ జీదోరోజీ జొరాష్ట్రియన్ మత పురోహితులు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ సహాయంతో కళాశాల ఎలిఫెన్‌స్టోన్ ఇనిస్టిట్యూట్‌లో చదివారు. తరువాత అక్కడే ఆచార్య పదవిని పొందారు. మహిళలకు విద్యను ప్రోత్సహించ డానికి జరిగిన ప్రత్యేక తరగతులలో ఆయన బోధించారు. తన జొరాష్ట్రియన్ మతంలో సంస్కరణల కోసం ఆయన పాటు పడ్డారు. నౌరోజీ ఆలోచనలు, ఆర్థికశాస్త్రంపై ఆధారపడినవి. కామా %డ% కో' అనే కంపెనీలో భాగస్వామి కావడానికి 1855 సంవత్సరంలో ఆయన లండన్ వెళ్లారు. ఆ కంపెనీ లివర్‌పూల్ లో బ్రిటన్‌లో స్థాపించబడిన మొదటి భారతీయ కంపెనీగా అవతరించింది. భారత స్థితి గతులను ఆంగ్లేయులకు విడమరిచి చెప్పారు. నౌరోజీ ఇంగ్లాండ్‌లో లిబరల్ పార్టీలో చేరారు. మూడేళ్లలో దాదాభాయ్ రాజీనామా చేసి, తన సొంత వ్యాపార సంస్థ 'దాదాభాయ్ నౌరోజీ %డ% కో.' ప్రాంభించారు. ఇంగ్లండ్‌లో భారతీయుడు స్థాపించిన తొలి వాణిజ్య సంస్థ అదే. 1865 నుండి 1866 వరకు, లండన్ విశ్వ విద్యాలయ కళాశాలలో గుజరాతీ భాషా ఉపాధ్యాయులుగా కూడా పనిచేశారు. 1865 లోనే, భారతీయ రాజకీయ, సామాజిక మరియు సాహిత్య సమస్యలు మరియు విషయాలను చర్చించి, ఇంగ్లాండ్ ఓటర్లకు అనుకూలంగా మార్చడం ఉద్దేశ్యంతో దాదాభాయ్ నౌరోజీ 'లండన్ ఇండియన్ సొసైటీ'ని స్థాపించారు. ఆయన 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్' ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క ప్రధాన సంస్థ, స్థాపన ప్రధాన ఉద్దేశం బ్రిటిష్ వారి ముందు భారతీయుల శక్తిని బలోపేతం చేయడం. 1874 లో బరోడా ఇన్స్టిట్యూట్ యొక్క మున్షి పోస్ట్ బాధ్యతను స్వీకరించారు. 1875 లో, అతను బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడు అయ్యారు. నౌరోజీ 1886 లో మొదటిసారిగా బ్రిటిష్ పార్లమెంట్ పదవి కోసం పోటీ చేసి, ఓటమి పాలు కాగా, 1892 లో తన రెండవ ప్రయత్నంలో విజయం సాధించి, హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైనారు. బ్రిటిష్ పార్లమెంటులో ఎన్నికైన మొదటి ఆసియా వ్యక్తిగా 1892 నుండి 1895 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్?డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొన సాగారు. బ్రిటిష్ పార్లమెంట్ లో భారత ఉప ఖండంలో వలస రాజ్యాల దోపిడీ సమస్యను మొదట లేవనెత్తారు. 1895 సంవత్సరానికి భారత వ్యయంపై రాయల్ కమిషన్ సభ్యులుగా కూడా నియమించ బడ్డారు. బరోడా మహారాజు శయాజీరావు గైక్వాడ్ కాలంలో సంస్థాన దివానుగా పని చేసారు. 1874 లో, ఆయన బరోడా ప్రధాన మంత్రి, 1885 నుండి 1888 వరకు ముంబై శాసన మండలి సభ్యుడయ్యారు. అలా ప్రజా జీవితంలో ప్రవేశించిన ఆయన "గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా" గా ప్రసిద్ధి గాంచారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులు సురేంద్రనాథ్ బెనర్జీతో పాటు వ్యవస్థాపకుల్లో ఒకరు. 1886 లో నౌరోజీ దాని అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1893 లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి రెండోసారి అధ్యక్షత వహించారు. 1906 లో జరిగిన కలకత్తా సమావేశానికి కూడా అధ్యక్షత వహించి మూడు సార్లు ఈ పదవి పొందిన తొలి నాయకులుగా అవతరించారు. దాదాబాయి నౌరోజీ పలు గ్రంథాలు రచించారు. ఆయన రాసిన పుస్తకం "పావర్టీ మరియు అన్బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా" అనే పుస్తకం భారతదేశం నుండి బ్రిటన్ తరలిస్తున్న నిధుల గురించి వివరించిన మొదటి పుస్తకం. అలాగే పార్సీల మర్యాదలు మరియు ఆచారాలు, యూరోపియన్ మరియు ఆసియటిక్ జాతులు, భారత దేశానికి కావలసినవి మరియు సాధనాలు, భారత దేశంలో పేదరికం మరియు బ్రిటిష్ రహిత నియమం, పార్సీ మతం తదితర రచనలు చేశారు. ఆయన 30 జూన్ 1917 న మరణించారు. బ్రిటిష్ పార్లమెంటులో భారతీయుల కోసం వాదించిన, బ్రిటిష్ విధానాలను విమర్శించిన నిజమైన జాతీయ వాది దాదా భాయిని ప్రతి భారతీయుడు గుర్తెరగాల్సిన అవసరం ఉంది.

# ప్రభుత్వ బడుల్లో విద్యాక్షీణతకు కారణం ఉపాధ్యాయులు ఎన్నటికీ కారు-సమతా సైనిక్ దళ్




మీరెక్కడ చదివారని 40 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలు పైబడిన ఉద్యోగస్తులను ఎవరినైనా అడిగితే, వెంటనే వారు మేము ప్రభుత్వ బడువుల్లోనే చదువుకున్నామని ఎంతో గర్వంగా చెప్పుతారు. ఇప్పుడు ఒక 25 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల మధ్య ఉద్యోగస్తుల్ని అడిగితే వారు ఏదో ఒక కార్పొరేటు విద్యార్థి సంస్థ లేక కొంతమంది గవర్నమెంట్ పాఠశాలల పేరు చెబుతారు. మార్పు ఎక్కడ, ఎందుకు వచ్చింది? ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగాలు పొందలేని వారికి, ప్రైవేట్ పాఠశాలల్లో, తక్కువ జీతాలు ఇచ్చి ఉద్యోగాలలో చేర్చుకొని, సరైన భోదన జరుగన్నప్పటికీ, ఆ ప్రైవేటు విద్యాసంస్థల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎందుకు చదువు చెప్పిస్తున్నారు? పేద తల్లిదండ్రులకు ప్రవేటు విద్యాసంస్థలలో చదివించడం ఆర్థికంగా భారమైనా, ఎన్నో విషమ పరిస్థితులు ఎదుర్కొన్నప్పటికీ, తమ స్తోమతకు మించి తల్లిదండ్రులు అధిక ఫీజులు కట్టి ఎందుకు చదివిస్తున్నారో, ఎందుకని అలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందో, అలాంటి కారణాల మీద ప్రభుత్వం ఒక ఎంక్వైరీ కమిషన్ను ఏర్పాటు చేయవలసిన పరిస్థితి తప్పనిసరిగా ఉంది. ఉచిత బోధన, అన్ని రకాల సదుపాయాలు, యూనిఫామ్స్, పుస్తకాలు, బ్యాగ్, బూట్లు అత్యంత ఖరీదైన డిజిటల్ బోధన, ట్యాబ్ల్ పంపిణీ జరుగుచున్నప్పటికీ, ఏ పరిస్థితులలో, ఏ కారణం చేత అత్యంత పేదలు, తమ స్థితికి మించి, తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నప్పటికీ, ఎందుకు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారో, తెలుసు కొనడానికి ప్రభుత్వం ఒక ఆదర్శమూర్తి అయిన ఎస్.ఆర్. శంకరన్ ఐఎఎస్ లాంటి విచారణ అధికారినైనా, కుదరకపోతే జస్టిస్ పున్నయ్య లాంటి కమిషన్ అయినా నియమించాలి. ఎక్కడ తప్పు జరుగుతుందో సమీక్షించుకోవాలి. ఏ కారణం చేత ప్రభుత్వ పాఠశాలలో చదివే వారి సంఖ్య నానాటికి తరిగిపోతుందో తెలుసుకొని, విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచటానికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో ఆ కమిషన్ నిర్ధారించగలగాలి. ప్రధానంగా ప్రవేట్ పాఠశాలలో బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధనకు నక్కకు, నాగలోకానికున్న తేడా ఉంది? అది ఏ విషయంలో అంటే, ముఖ్యంగా ప్రైవేట్ ఉపాధ్యాయులు 220 పని దినాలు పూర్తిగా బోధనలోనే గడుపుతారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యం బోధనకు ఒక గంట కూడా అవరోధం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ పర్యవేక్షిస్తుంది. కావాలనుకుంటే ఎడిషనల్ క్లాసెస్ కూడా నిర్వహిస్తారు. పాఠశాల జరుగుచున్న సమయంలో ప్రైవేటు ఉపాధ్యాయులను తమ సెల్ఫోన్ ఉపయోగించుకునే అవకాశం ఏ ఒక్కరికి కూడా యాజమాన్యం ఇవ్వదు. సెలవులు పెట్టినప్పుడు దానికి ప్రత్నామయంగా వేరే ఉపాధ్యాయులను ఉపయోగించటం ప్రైవేట్ పాఠశాలలో జరుగుచున్నది. మెజారిటీ ప్రభుత్వ ఉపాధ్యాయులు 220 పని దినాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కొత్తదనం కోసం ప్రవేశపెట్టే వివిధ ప్రణాళికలో తలములకలైపోతారు. వాటి వలనే 100 రోజులపైగా విద్యార్థుల పని దినాలకు నష్టం వాటిల్లుచున్నది. ఉపాధ్యాయుల ప్రసూతి సెలవులు, మెడికల్ లీవు, అవసరం ఉన్నా లేకపోయినా పెట్టుకునే సెలవుల వలనే అధికంగా విద్యార్థుల పని దినాలకు నష్టం కలుగుచున్నది. ప్రభుత్వం దీర్ఘకాలపు సెలవులు పెట్టుకున్నా ఉపాధ్యాయుల స్థానంలో వారికి ప్రత్యామ్యంగా వేరే వాళ్ళని నియమించుకునే అవకాశం గత మూడు శతాబ్దాలుగా ఇవ్వడం లేదు. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల వలన విద్యార్థులకు బోధనా దినాలనష్టం జరుగుతుంది. అదే విధంగా ఉపాధ్యాయులు సెలవుల వలన విద్యార్థుల బోధనా దినాలకు నష్టం కలుగుతుంది. ఉపాధ్యాయుల ఉద్యోగ బాధ్యతలు నిర్వహణ మొత్తం సంపూర్ణంగా సెల్ఫోన్తో ప్రభుత్వమే ముడిపెట్టారు. ఎప్పుడైతే ఉపాధ్యాయుడు సెల్ఫోన్తో బంధించబడ్డాడో అప్పుడే విద్యా ప్రమాణాలు మొత్తంగా దెబ్బతిన్నాయి. ఒక బాధ్యత కలిగిన ఉపాధ్యాయుడి మనోవేదన ఎలా ఉందంటే: అత్యధిక పని దినాల్లో గూగుల్ షీట్ నిరంతరం పూర్తి చేయడం, ఐ.యమ్.యమ్.ఎస్ యాప్ ద్వారా మొన్నటి వరకు టాయిలెట్స్ ఫోటోలు తీయడం, ఆయాల హాజరు నమోదు చేయడం, మధ్యాహ్నం భోజనాల ఫోటోలు తీయడం, యాక్చువల్ అటెండెన్స్ పూర్తి చేయడం, విద్యార్థుల రోజు వారీ హాజరు, రానివారి కారణాలు తెలపడం, ఉపాధ్యాయుల హాజరు యాప్, స్టూడెంట్ కిట్, సిస్టమ్ డ్రాపౌట్స్, యుడైస్, ఎస్.డియమ్.ఎస్, స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్ మెంట్ ద్వారా నాడు నేడు పనులను పర్యవేక్షించడం, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన ఆరు రిజిస్టర్ల మెయింటినెన్స్, నాడు నేడు ఆరు రికార్డు పనులు, ప్రశస్త, ప్రధానంగా దీక్ష యాప్, నిష్టా, ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సెస్, గూగుల్ మీటింగ్స్, వెబ్నార్ మీటింగ్స్, హెచ్ఎం మీటింగ్స్, పరీక్ష పేపర్లు కాంప్లెక్స్ కి వెళ్ళటమో, ఎంఆర్సి సెంటర్ కి వెళ్లి తెచ్చుకోవడమో, స్టూడెంట్ కిట్స్ పేరులో ఉండే బుక్స్, బ్యాగ్స్, బూట్లు సాక్స్, బెల్టులు, ఇతర సానిటరీ ఐటమ్స్ ఎప్పటికప్పుడు ఎంఈఓ ఆఫీస్ సెంటర్ కు వెళ్లి తెచ్చుకోవడం, సానిటరీ న్యాప్కిన్స్ ఇవ్వడం, ఐరన్ టాబ్లెట్స్ వేయడం, డి వామింగ్ టాబ్లెట్స్ వేయడం, గుడ్లు, చిక్కిలు పంపిణీ చేయడం, కిచెన్ గార్డెన్ పర్యవేక్షణ, ఇంకుడు గుంతలు, ప్లానిటేషన్, ఒకటా, రెండా, లెక్కలేనన్నివి. స్టూడెంట్ కిట్ లోని ఐటమ్స్ అన్ని ఒకేసారి పంపిణీ జరగదు. విడతల వారీగా పంపిణీ చేస్తారు. వాటిని విధిగా వెళ్లి తెచ్చుకోవాలి. నిరంతరం యాప్స అప్డేషన్ పాఠశాల నిర్వహణకు సంబంధించిన ఎన్నో రకాల రిజిస్టర్లు కనీసంగా 30 నుండి 40 వరకు ఉంటాయి. అనేక రకాలైన ఈవెంట్స్ ను పాఠశాలలో నిరంతరం నిర్వహిస్తా ఉంటారు. ప్రధానమంత్రి మన్కీ బాత్ ఇలాంటివి ఎన్ని? ఎన్నెన్నో. అలాంటి వ్యవస్థకు ఉపాధ్యాయులను బానిసలుగా చేశారు. గత రెండు సంవత్సరముల నుండి పాఠశాల మెయింటెనెన్స్ గ్రాంట్స్ ఒక్క రూపాయి కూడా మంజూరు లేదంటే పాఠశాల నిర్వహణ ఎంత కష్టసాధ్యమైనదో విజ్ఞులు ఒక్కసారి మనసు పెట్టి ఆలోచించండి. తప్పు ఎక్కడ జరుగుతుంది? ఆ తప్పుకి మూల కారణమేమిటి? ప్రభుత్వం చేస్తున్న తప్పులకు పరిష్కార మార్గం ఏది? విద్యాశాఖ అధికారులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయుల పిల్లలే తాము పనిచేస్తున్న పాఠశాలలో చదివించడం లేదంటే వాళ్లంతా అభద్రతా భావంలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులకు ఇచ్చిన బైజూస్ ట్యాబ్స్ తో అనేక ఇబ్బందికరమైన సమస్యలను ఎదుర్కొనడం, పాఠశాల విద్యా కమిటీ నిర్వహణ, వాటి ఎలక్షన్లు, చదువు చెప్పడం, కొంత జ్ఞానం పెంపొందించడం వంటి ప్రధానమైన పనులకు సమయం చిక్కడం లేదు. బడులకు, పెయింట్స్ వేసి, పిల్లలకు బండెడు పుస్తకాలు ఇచ్చి, తల్లులకు వేల రూపాయలు ఇచ్చి ఎంతో చేశాం అనుకుంటున్నారు కాని చదువు చెప్పడానికి టీచర్లకు సమయం ఇవ్వడం లేదు. ఏం చేయగలిగితే ఈ దుఃఖ నివారణ జరుగుతుంది. ఇంత పెద్ద జటిలమైన సమస్యను, అసలు సమస్యగా చూడకపోవటమే ఈ వ్యవస్థ యొక్క ప్రధాన లోపం. ప్రభుత్వ ఉపాధ్యాయులు చేస్తున్న పనులలో ఏ ఒక్కటి ప్రైవేటు బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చేయడం లేదు. వారు తమ పూర్తి పనిగంటలను పాఠశాలల్లోనే బోధనలో వినియోగిస్తున్నారు. ప్రభుత్వ టీచర్లను బోధనలో నిమగ్నమయ్యేటట్టు ప్రభుత్వం చేయడం లేదు. అక్కడక్కడ పనిచేయని టీచర్స్ ఉన్నారు. అది వాస్తవం. వారిని పనిచేసేటట్లు యాజమాన్యం చేయగలగాలి. శిక్ష తప్పనిసరిగా ఉండాలి. ఉపాధ్యాయులు మెడికల్ లీవ్, మేటర్నెట్ లీవ్ పెట్టినప్పుడు ఆ యొక్క స్థానాన్ని తాత్కాలికంగా భర్తీ చేసే సదుపాయం ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలి. ఇంత ప్రభుత్వమే ఇంత కుట్రపూరితంగా చేస్తూఉపాధ్యాయులను సమాజంలో నేరస్తుల జాబితాలో చేర్చింది. గవర్నమెంట్ బడిలో చేర్పిస్తే చదువు రాదనే ముద్ర చాలా బలంగా వేసింది. చదువు రాకపోవటానికి ప్రభుత్వమే ప్రధాన కారణమై, ఉపాధ్యాయులనే దోషులుగా చూపిస్తున్నది. ఇంత విషపూరితమైన వ్యతిరేకమైన భావజాలం ఉపాధ్యాయుల పట్ల సమాజంలో బలంగా రుద్దారు. అందరు విద్య, అందరి బాధ్యతను విస్మరిస్తూ, ప్రభుత్వం విద్యా బాధ్యతను అప్పళంగా ప్రవేటు అప్పజెప్పుతూ, జనాభా దామాషా ప్రకారం విద్యకు బడ్జెట్లో తక్కువ శాతం కేటాయిస్తూ, అమ్మ ఒడి లాంటి పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో నమోదును తగ్గించి, ప్రైవేటు విద్యను ప్రోత్సాహిస్తూ, కుట్రపూరితమైన మనువాద భావజాలాన్ని సిలబస్ నిండా నింపి పూర్తిగా ప్రభుత్వ విద్యాసంస్థలను బొంద పెట్టటమేప్రభుత్వ ప్రధాన ఆశయంగా కనపడుతుంది. ప్రభుత్వం చేస్తున్న ఈ పీడ, చీడ విరగడైపోవడానికి సమాజమే ఈ అత్యంత ప్రభలమైన ఈ సమస్యను గుర్తించి దీనిని సమాజమే బాగు చేసుకోక పోయినట్లయితే, మరలా మనస్మృతి కాలంనాటి శూద్రులు చదువుకోకూడదు అనే ప్రవర్తన నియమావళి ఈ దేశంలో వస్తుంది. నమో బుద్ధాయ!

జై భీమ్!!! జై భారత్ !!! జై సంవిధాన్!!!!

# రీలే నిరాహార దీక్షలు ప్రారంభం

## -పూజారి చక్రపాణిని వెంటనే అరెస్టుముడుమూల్ దళిత న్యాయ పోరాట కమిటీ




నారాయణపేట జిల్లా కృష్ణ మండల్ గత నెల 18వ తారీఖున ముడుమాల్ గ్రామంలోని దళితులను గుడిలోకి రానివ్వకుండా దళితుల పెళ్లిని అడ్డుకొని అవమాన పరిచిన పూజారి చక్రపాణి పై ఎఫ్ఐఆర్ నమోదయి నేటికీ దాదాపు 20 రోజులు కావస్తున్నా కూడా పూజారి చక్రపాణిని పోలీసులు అరెస్టు చేయకపోవడాన్ని మరియు గత కొన్ని సంవత్సరాలుగా ఏకకాలంలో రెండు ప్రభుత్వ ఉద్యోగ జీతభత్యాలు పొందుతున్నడని ముడుమల్ దళిత న్యాయ పోరాట కమిటీ నాయకులు సంబంధిత అధికారులు అయినా ఎంపీడీవో గారికి ఎమ్మార్వో గారికి తెలియజేసినప్పటికీ కూడా ఇంకా అతడిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయకపోవడాన్ని నిరసిస్తూ ముడుమల్ దళితులను కించపరిచిన మరియు ఒకే కాలంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న పూజారి చక్రపాణిని వెంటనే అరెస్టు చేసి అతడిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రిలే నిరాహార దీక్షలకు పిలుపునివ్వడం జరిగిందని అందులో భాగంగానే మొదటిరోజు రీలే నిరాహార దీక్షను ఘనంగా విజయవంతం చేయడం జరిగిందని ముడుమల్ దళిత న్యాయ పోరాట కమిటీ నాయకులు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముడుమల్ దళిత న్యాయ పోరాట కమిటీ నాయకులు-అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నియోజకవర్గ అధ్యక్షులు పృథ్వీరాజ్, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జీర్గల్ నగేష్ మాదిగ,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, టిఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు బొప్పల్లి వెంకటేష్, నారాయణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఉప్పరపల్లి బాలకృష్ణ, ముడుమల్ గ్రామస్తులు నాగప్ప,కృష్ణ,ఓబ్లేష్, లక్ష్మణ్,తిరుమలేష్, అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ క్రియాశీలక సభ్యులు తల్వార్ నరేష్,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


# హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన సదస్సు



**నాగర్ కర్నూల్ రూరల్ సెప్టెంబర్ 5:**

వై ఆర్ జి కేర్ స్వచ్ఛంధ సంస్థ లింక్ వర్కర్ స్కీం ప్రోగ్రాం ద్వారా గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ లింక్ వర్కర్ హేమలత మాట్లాడుతూ హెచ్ఐవి నాలుగు రకాలుగా సోకుతుందని కలుషితమైన సూది చిరంజీలను వాడరాదని హెచ్ఐవి సోకిన వ్యక్తి నుండి రక్తం తీసుకోరాదని హెచ్ఐవి సోకిన వ్యక్తులతో లైంగిక సంబంధం పెట్టుకోరాదని తప్పనిసరి అయితే కండోమ్ వాడాలని ఒకవేళ తల్లికి హెచ్ఐవి సోకినట్లయితే కచ్చితంగా ఆసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తద్వారా పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవి రాకుండా నివారించవచ్చని తెలియజేశారు మరియు క్షయ వ్యాధి పైన కూడా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకొని హెచ్ఐవి ఉన్నదో లేదో తెలుసుకోవాలని హెచ్ఐవి సోకిన ఎవ్వరు కూడా భయపడరాదని మందుల ద్వారా జీవిత కాలాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుప్రజత జూనియర్ లెక్చరర్స్ రామారావు,శ్రీనివాసులు, సైజాద్దీన్ బేగం,యాదయ్య,స్వర్ణలత 134మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి




మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతినీ పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించిన మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి గారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా, తత్త్వవేత్తగా, రాజకీయ నాయకుడుగా అంచలంచెలుగా ఎదిగారని గుర్తు చేశారు. రాధాకృష్ణన్ గారు "ఉపాధ్యాయులు దేశంలో అత్యుత్తమ ఆలోచన గలవారు" అని విశ్వసించేవారు. 1962 నుండి, భారతదేశంలో ప్రతీ సంవత్సరం అతని పుట్టినరోజు సెప్టెంబర్ 5 న ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా వారు ఈ దేశానికి, దేశప్రజలకు అందించిన సేవలకు గాను ఇరవై ఏడు సార్లు నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారని అన్నారు. ఈ సందర్భంగా మరోసారి అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.లి

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**కల్వకుర్తి సెప్టెంబర్ 5:**

ఊర్కొండ మండలంలోని ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5000/- అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సేవదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ యాదయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు కానుగుల మల్లేష్, మృగని రమేష్, దుబ్బ రాములు, దుబ్బ నగేష్, దుబ్బ రామస్వామి, దుబ్బ శ్రీశైలం, దుబ్బ వేణు, దుబ్బ రామచంద్రయ్య, దుబ్బ బాల్ రాం, దుబ్బ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన పి నర్సింహా రెడ్డి



**మద్దూర్ సెప్టెంబర్ 5 :**

మద్దూర్ మండల నూతన ఎంపిడీవో గా బాధ్యతలు స్వీకరించిన పి నర్సింహా రెడ్డి. ఈయన నారాయణపేట జిల్లా పరిషత్ కార్యాలయం సూపర్డెంట్ గా విధులు నిర్వహిస్తూ నేడు మద్దూరు ఎంపీడీవో గా బాధ్యతలు తీసుకోవడం జరిగింది.




## ఓటీటీలోకి వచ్చేస్తున్న 'కమిటీ కుర్రోళ్ళు'

హారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో దర్శకుడు యాదు వంశీ తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. ఆగస్ట్ 9న చిన్న సినిమాగా థియేటర్లలో విడుదలైన ఈ సినిమా భారీ విజయం సాధించి 17 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. కాగా, తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు రెడీ అయ్యింది. ఈటీవి విన్ సెప్టెంబర్ 12 నుంచి కమిటీ కుర్రోళ్ళు సినిమా స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ విషయాన్ని ఈటీవీ విన్ అధికారికంగా ప్రకటించింది.




## ఫుల్ స్వింగ్‌లో నాని...
## "హిట్ 3" రిలీజ్ డేట్ ఫిక్స్!

నేచురల్ స్టార్ నాని లేటెస్ట్ మూవీ "సరిపోదా శనివారం"తో హ్యాట్రిక్ హిట్ సాధించి ఫుల్ స్వింగ్‌లో ఉన్నాడు. కాగా, వరుస హిట్లతో దూసుకెళ్తున్న నాని తాజాగా మరో కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు. దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కస్తున్న మాస్ పోలీస్ యాక్షన్ డ్రామా "హిట్ 3" గురించి సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. పోలీస్ యాక్షన్ యూనివర్స్‌లో తెరకెక్కుతున్న హిట్-3 సినిమా నుండి లేటెస్ట్ మాస్ పోస్టర్‌తో పాటు, నానిని అర్జున్ సర్కార్‌గా పరిచయం చేస్తూ ఆసక్తికరమైన మాస్ గ్లింప్స్ కూడా విడుదలయ్యాయి. దాంతో పాటు ఈ మూవీని వచ్చే ఏడాది మే1న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నట్టుగా కూడా అనౌన్స్ చేసేసారు. ఈ మూవీకి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తుండగా.. నాని నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## గన్స్‌తో యాక్షన్ చేయడం ఎంజాయ్ చేశా: ఫరియా అబ్దుల్లా



బ్లాక్‌బస్టర్ మత్తు వదలరా సినిమాకు సీక్వెల్‌గా 'మత్తువదలారా 2' ప్రేక్షకులని అలరించడానికి సిద్ధమవుతోంది. శ్రీ సింహ కోడూరి లీడ్ రోల్‌లో తన సైడ్ కిక్ గా సత్య నటిస్తున్న ఈ చిత్రానికి రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రతిష్టాత్మక బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 13న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. "మత్తువదలారా 2 సినిమా ఒక థ్రిల్లర్. కథ చాలా నచ్చింది. విన్న వెంటనే ఓకే చేసేశా. మత్తువదలారా పార్ట్ 1 బిగ్ హిట్. సెకండ్ పార్ట్... ఫస్ట్ పార్ట్‌కి డిఫరెంట్‌గా వుంటుంది. శ్రీసింహ, సత్య క్యారెక్టర్స్ డెలివరీ బాయ్స్ నుంచి స్పెషల్‌గా ఏజెంట్‌గా కనిపిస్తారు. ఇందులో నా క్యారెక్టర్ పేరు సన్నిధి. నేను కూడా ఒక స్పెషల్ ఏజెంట్. శ్రీసింహ, సత్య క్యారెక్టర్స్ పై సాఫ్ట్ కార్నర్ వుంటుంది. ఇందులో నా క్యారెక్టర్‌కు యాక్షన్ వుంటుంది. గన్స్‌తో యాక్షన్ చేయడం చాలా ఎంజాయ్ చేశా. ఈ సినిమాలో లిరిక్స్ రాయడంతో పాటు సాంగ్ పాడాను. అలాగే నా టీంతో సాంగ్ కొరియోగ్రఫీ కూడా చేశాను. రితేష్ రానా చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని వుంది. కాల భైరవ మ్యూజిక్ సర్‌ప్రైజింగ్‌గా వుంటుంది. నా సాంగ్‌ని ఆయన నెక్స్ లెవెల్‌కి తీసుకెళ్ళారు" అని అన్నారు.

## అఖండ సౌందర్య విందు



తమిళ చిత్రం 'విరాటు' తో 2014లో సినీ రంగ ప్రవేశం చేసిన ప్రగ్యా జైస్వాల్ తెలుగు లో కూడా అదే టైమ్ లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు లో మొదటి సినిమా మిర్చి లాంటి కుర్రాడు సినిమా నిరాశ పరిచింది. మొదటి సినిమా నిరాశ పరచినా కూడా 'కంచె' సినిమాలో నటించే అవకాశం ప్రగ్యాకు వచ్చింది. క్రిష్ దర్శకత్వంలో కంచె సినిమాలో మెగా హీరో వరుణ్ తేజ్ కి జోడీగా ప్రగ్యా జైస్వాల్ నటించింది. ఆ సినిమా తో ఒక్కసారిగా టాలీవుడ్ లో ఫేమస్ అయ్యింది. కంచె సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఆ సినిమాలో ప్రగ్యా అందానికి, నటనకు మంచి మార్కులు పడ్డాయి. బాలయ్యకు జోడీగా నటించిన అఖండ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా ఆశించిన స్థాయిలో ఈమెకు ఆఫర్లు రాలేదు. సినిమాల్లో ఆఫర్లతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో ఈమె అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. అన్ని భాషల నెటిజన్స్ ప్రగ్యా జైస్వాల్ యొక్క అందమైన ఫోటోలకు ఫిదా అవుతూ ఉంటారు. నెట్టింట ఆమె షేర్ చేసే ఫోటోలు రెగ్యులర్ గా వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి ప్రగ్యా జైస్వాల్ అందమైన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈసారి లేత గోధుమ రంగు లో ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షో కు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.